రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అరెస్ట్!



టీమీడియా , అక్టోబర్ 25 , ములుగు :
ములుగు జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బాదం ప్రవీణ్ అరెస్టు కలకలం రేపింది. ములుగు సమీపంలోని జాకారం వద్ద జాతీయ రహదారిపై సీఐడీ అధికారులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు. అయితే ఈ అరెస్టుకు గల కారణాలపై అధికారికంగా పూర్తి వివరాలు వెల్లడికావాల్సి ఉంది.
ములుగులో ఈరోజు మధ్యాహ్నం రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఎన్నికలు జరగాల్సి ఉండగా.. తమకు నచ్చిన వ్యక్తినే అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకోవాలని కొందరు మిల్లర్లపై ఒత్తిడి తెస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. దీంతో ఎన్నికల వ్యవహారం వివాదాస్పదంగా మారినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా, అసోసియేషన్‌కు చెందిన మాజీ కార్యవర్గ సభ్యులు ముగ్గురిని సీఐడీ అధికారులమని చెప్పిన గుర్తుతెలియని వ్యక్తులు తీసుకెళ్లారు.



సోమవారం 26/10/2026 టీమీడియా మెయిన్ ఎడిషన్ ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ

సన్నబియ్యం సరఫరాలో అక్రమాలు!

⏭ రంగంలోకి సీఐడీ.. 14 మంది మిల్లర్లు అరెస్ట్ ⏭ సివిల్ సప్లైస్ అధికారుల పాత్రపైనా దర్యాప్తు

టీ మీడియా ,అక్టోబర్ 25 ,హైదరాబాద్ బ్యూరో:
తెలంగాణ రాష్ట్రంలో సన్నబియ్యం సరఫరాలో అక్రమాలపై ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రభుత్వం కేటాయించిన సన్న రకం ధాన్యాన్ని పక్కదారి పట్టించి, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సీఐ)కి దొడ్డు రకం బియ్యం సరఫరా చేసినట్లు ఆరోపణలు రావడంతో సీఐడీ రంగంలోకి దిగింది. పౌర సరఫరాల శాఖ అధికారుల ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన సీఐడీ అధికారులు ఇప్పటికే మూడు క్రిమినల్ కేసులు నమోదు చేసి, 14 మంది మిల్లర్లను అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు.

బహిరంగ మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయం

2025--26 ఖరీఫ్ సీజన్‌లో పౌర సరఫరాల శాఖ 71.86 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించింది. ఇందులో భాగంగా ఎఫ్‌సీఐకి 59.60 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం అప్పగించాల్సి ఉంది. అయితే, ప్రభుత్వ నిబంధనల ప్రకారం సన్న రకం బియ్యం కోసం కేటాయించిన ధాన్యాన్ని కొందరు మిల్లర్లు పక్కదారి పట్టించి, బహిరంగ మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయించినట్లు దర్యాప్తులో గుర్తించినట్లు అధికారులు తెలిపారు.సన్న రకం ధాన్యానికి బదులుగా ఇతర రాష్ట్రాల నుంచి తక్కువ ధరకు లభించే దొడ్డు రకం బియ్యాన్ని సేకరించి ఎఫ్‌సీఐకి సరఫరా చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ బృందాలు రైస్ మిల్లుల్లో నిర్వహించిన తనిఖీల్లో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. మిల్లుల నుంచి సేకరించిన నమూనాలను ప్రయోగశాలలకు పంపించగా, అవి సన్న రకం బియ్యం కాదని నిర్ధారణ అయినట్లు అధికారులు వెల్లడించారు.

మూడు జిల్లాల్లో 14 మంది అరెస్ట్

నిజామాబాద్, కరీంనగర్, ములుగు జిల్లాల్లోని 16 రైస్ మిల్లులు సన్న రకం బియ్యం సరఫరా చేయాల్సి ఉండగా, వాటి స్థానంలో 3,385.820 మెట్రిక్ టన్నుల దొడ్డు రకం బియ్యాన్ని అప్పగించినట్లు దర్యాప్తులో గుర్తించారు. ఈ వ్యవహారం వల్ల బోనస్ రూపంలోనే ప్రభుత్వానికి రూ.1.69 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు అధికారులు అంచనా వేశారు.మరో 45,414 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని పక్కదారి పట్టించేందుకు ప్రయత్నించినట్లు ఆరోపణలు రావడంతో, పౌర సరఫరాల శాఖ అధికారులు సకాలంలో స్పందించి సరఫరాలను నిలిపివేశారు. దీంతో సుమారు రూ.242 కోట్ల బోనస్ సొమ్ము దుర్వినియోగం కాకుండా చర్యలు తీసుకున్నట్లు సమాచారం.ధాన్యం అక్రమ మళ్లింపు, నమ్మకద్రోహం, కుట్రపూరితంగా ప్రభుత్వ ఖజానాకు నష్టం కలిగించడం వంటి ఆరోపణలపై సీఐడీ అధికారులు కేసులు నమోదు చేసి, మొత్తం 14 మందిని అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. ములుగు రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బాదం ప్రవీణ్‌ను జాకారం జాతీయ రహదారిపై అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.కరీంనగర్ జిల్లాలోని జమ్మికుంట, హుజూరాబాద్ ప్రాంతాల్లోనూ సీఐడీ అధికారులు సోదాలు నిర్వహించారు. బియ్యం మళ్లింపు వ్యవహారంలో ముగ్గురు కీలక మిల్లర్లను అరెస్ట్ చేయగా, హుజూరాబాద్‌లోని వరలక్ష్మి రైస్ మిల్ యజమానిని కూడా అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

సివిల్ సప్లైస్ అధికారుల పాత్రపై ఆరా

ప్రభుత్వానికి బకాయిలు చెల్లించని డిఫాల్టర్ మిల్లర్లకు చెందిన మిల్లులు, యంత్రాలు, రవాణా వాహనాలు, వ్యక్తిగత ఆస్తులను జప్తు చేసేందుకు అధికారులు చట్టపరమైన ప్రక్రియ ప్రారంభించినట్లు (మిగతా 2లో)

రేషన్ బియ్యం తూకాల్లో భారీ తేడాలు



⏭ ప్రశ్నిస్తే ఎలుకలపై నిందలు

టీ మీడియా ,అక్టోబర్ 25 ,అమరావతి బ్యూరో:
ప్రజా పంపిణీ వ్యవస్థలో అక్రమాలకు అడ్డుకట్ట వేసి, పారదర్శకతను పెంచేందుకు ప్రభుత్వం పలు చర్యలు చేపడుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో రేషన్ బియ్యం తూకాల్లో తేడాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి చౌక ధరల దుకాణాలకు సరఫరా చేసే బియ్యం బస్తాల్లోనే భారీగా తరుగు వస్తోందని పలువురు రేషన్ డీలర్లు ఆరోపిస్తున్నారు. ప్రతి నెలా ఇదే పరిస్థితి ఎదురవుతోందని వారు చెబుతున్నారు. మరోవైపు, కార్డుదారులకు పంపిణీ చేసే బియ్యంలోనూ కోతలు పెడుతున్నారనే ఫిర్యాదులు వినిపిస్తున్నాయి.

ప్రశ్నిస్తే.. ఎలుకలు తిన్నాయంట!

ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలంలోని ఓ రేషన్ దుకాణంలో ఒక్కో రేషన్ కార్డుకు 500 గ్రాముల వరకు తక్కువగా బియ్యం తూకం వేస్తున్నారని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే, పై నుంచి వచ్చే బియ్యం బస్తాల్లోనే తరుగు ఉంటోందని, ఎలుకలు కొంత బియ్యం తినేయడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడుతోందని డీలర్ సమాధానమిస్తున్నట్లు వారు వాపోతున్నారు. ప్రజలకు అందాల్సిన రేషన్‌లో తేడాలు వస్తున్నా సంబంధిత అధికారులు ఎందుకు స్పందించడం లేదని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు.

ఒక్కో బస్తాలో కిలోకు పైగా తరుగు?

కొయ్యలగూడెం మండలంలో సుమారు 40 రేషన్ దుకాణాలు ఉన్నాయి. ఈ మండలంలోని దుకాణాలకు సరఫరా అవుతున్న బియ్యం బస్తాల్లో ప్రతి నెలా ఒక్కో బస్తాకు కిలోకు పైగా తరుగు వస్తోందని డీలర్లు చెబుతున్నారు. ఈ కారణంగా ఒక్కో దుకాణానికి నెలకు సుమారు 75 కిలోల నుంచి క్వింటా వరకు బియ్యం తగ్గిపోతున్నట్లు వారి వాదన.
ఈ తేడాలపై ప్రశ్నిస్తే, నష్టాన్ని సర్దుబాటు చేసుకునేందుకు ఒక్కో డీలర్‌కు 25 నుంచి 40 కిలోల వరకు బియ్యం (మిగతా 2లో)

నిల్వలు నిండుగా ఉన్నా కృత్రిమ కొరత



⏭ పూటకో రేటుతో బియ్యం వ్యాపారుల దోపిడీ

టీ మీడియా ,అక్టోబర్ 25 ,హైదరాబాద్ బ్యూరో:
తెలంగాణలో ధాన్యం దిగుబడులు రికార్డు స్థాయికి చేరుకున్నా.. సామాన్యులకు మాత్రం బియ్యం ధరల భారం తప్పడం లేదు. గత కొన్నేళ్లుగా వరి సాగు విస్తీర్ణం, ధాన్యం ఉత్పత్తి పెరిగినప్పటికీ, మార్కెట్‌లో సన్నబియ్యం ధరలు రోజురోజుకూ (మిగతా 2లో)

ఓటును, దేశాన్ని కాపాడుకుందాం!



⏭ నవంబర్ 1న ఢిల్లీలో ర్యాలీకి రాహుల్ గాంధీ పిలుపు

టీ మీడియా, అక్టోబర్ 25, ఢిల్లీ బ్యూరో:
ఓటర్ల జాబితాల నుంచి పేర్ల తొలగింపు, ఎన్నికల ప్రక్రియలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై నిరసనగా నవంబర్ 1న ఢిల్లీలో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ప్రకటించారు. 'సేవ్ ది ఓట్ -- సేవ్ ది కంట్రీ' (ఓటును, దేశాన్ని కాపాడుకుందాం) పేరుతో జన మార్చ్, భారీ బహిరంగ (మిగతా 2లో)

తెలంగాణలో వ్యవసాయానికి 12 గంటల విద్యుత్ సరఫరా!

⏭ ఇతర రాష్ట్రాల్లో 10, 9, 8, 7 గంటలకే పరిమితం

టీ మీడియా, అక్టోబర్ 25, హైదరాబాద్ బ్యూరో:
తెలంగాణలో వ్యవసాయ రంగానికి రోజుకు 12 గంటలకు పైగా విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు విద్యుత్ పంపిణీ సంస్థలు (డిస్కంలు) వెల్లడించాయి. మరోవైపు, దేశంలోని పలు రాష్ట్రాల్లో వ్యవసాయ బోర్లకు 7 నుంచి 10 గంటల వరకే విద్యుత్ సరఫరా అవుతోందని తెలిపాయి. ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు, పెరుగుతున్న విద్యుత్ డిమాండ్ నేపథ్యంలో విద్యుత్ సరఫరా నిర్వహణ సవాలుగా మారిందని పేర్కొన్నాయి.

ఇతర రాష్ట్రాల్లో పరిమిత సరఫరా

డిస్కంలు రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించిన నివేదిక ప్రకారం.. మధ్యప్రదేశ్‌లో రోజుకు 10 గంటలు, ఆంధ్రప్రదేశ్‌లో 9 గంటలు, మహారాష్ట్రలో 8 గంటలు, కర్ణాటకలో 7 గంటల చొప్పున వ్యవసాయానికి విద్యుత్ సరఫరా జరుగుతోంది. పలు రాష్ట్రాలు సౌర విద్యుత్ ఉత్పత్తి అందుబాటులో ఉండే పగటిపూటనే వ్యవసాయానికి విద్యుత్ అందిస్తున్నట్లు నివేదికలో పేర్కొన్నాయి.



పెరుగుతున్న వ్యవసాయ విద్యుత్ వినియోగం

తెలంగాణలో మొత్తం 30.60 లక్షల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. 2022 ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయ రంగంలో విద్యుత్ వినియోగం 2,640.70 కోట్ల యూనిట్లుగా ఉండగా, 2026 ఖరీఫ్ సీజన్‌లో అది 3,947.20 కోట్ల యూనిట్లకు పెరిగినట్లు డిస్కంలు తెలిపాయి. ఈ ఏడాది వ్యవసాయ రంగంలో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగిందని వెల్లడించాయి. (మిగతా 2లో)

సన్నబియ్యం సరఫరాలో అక్రమాలు!

(మొదటి పేజీ తరువాయి)

సమాచారం. సంబంధిత వ్యక్తుల బ్యాంకు ఖాతాలను నిలిపివేసేందుకు కూడా చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది.గత పదేళ్లకు పైగా జరిగిన కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) లావాదేవీలపై సమగ్ర ఆడిట్ నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించినట్లు సమాచారం. ధాన్యం కేటాయింపులు, బియ్యం కన్వర్షన్ అనుమతుల జారీలో సివిల్ సప్లైస్ అధికారుల పాత్ర ఏమైనా ఉందా అనే కోణంలోనూ సీఐడీ ఆధారాలు సేకరిస్తోంది.

సన్న రకం ధాన్యం సేకరణ నుంచి మిల్లింగ్, బియ్యం సరఫరా వరకు జరిగిన లావాదేవీలను పరిశీలిస్తున్న దర్యాప్తు అధికారులు.. అక్రమాలకు పాల్పడినట్లు తేలిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునే దిశగా విచారణ కొనసాగిస్తున్నారు.

రేషన్ బియ్యం తూకాల్లో భారీ తేడాలు

(మొదటి పేజీ తరువాయి)

ఇచ్చి వ్యవహారాన్ని ముగించుకోవాలని సూచిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే, ఈ ఆరోపణల్లో వాస్తవాలేమిటో, బియ్యం ఎక్కడ తగ్గుతోందో అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపితేనే స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

50.500 కిలోలు ఉండాల్సిన బస్తాలో 48.030 కిలోలే!

ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి చౌక ధరల దుకాణాలకు సరఫరా చేసే బియ్యం బస్తా బరువు 50.500 కిలోలు ఉండాల్సి ఉండగా, వేలేరుపాడు మండలంలోని ఓ దుకాణంలో 48.030 కిలోల బరువు మాత్రమే ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అంటే ఒక్కో బస్తాలో 2.470 కిలోల తేడా కనిపిస్తోంది. మరికొన్ని చోట్ల బస్తా బరువు 47 కిలోలకు పడిపోతోందని డీలర్లు చెబుతున్నారు.ఈ తేడాలకు కారణం ఏమిటి? రవాణా సమయంలో బియ్యం తగ్గుతోందా? గోదాముల వద్దే తూకాల్లో తేడాలు చోటుచేసుకుంటున్నాయా? లేక సరఫరా వ్యవస్థలో మరేదైనా అక్రమాలు జరుగుతున్నాయా? అన్న ప్రశ్నలకు అధికారులు సమాధానం చెప్పాల్సి ఉంది.

రేషన్ బియ్యం రీసైక్లింగ్ ఆరోపణలు!

కొన్ని ప్రాంతాల్లో కొందరు రేషన్ డీలర్లు కార్డుదారుల నుంచి కిలో బియ్యాన్ని రూ.10 నుంచి రూ.12 చొప్పున కొనుగోలు చేసి, వాటిని మిల్లులకు తరలిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆ బియ్యాన్ని తిరిగి ప్రాసెస్ చేసి అధిక ధరలకు మార్కెట్లో విక్రయిస్తున్నారనే విమర్శలు కూడా ఉన్నాయి. కిలో రూ.60 వరకు విక్రయిస్తున్నారనే ఆరోపణలపై సంబంధిత అధికారులు విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాల్సిన అవసరం ఉంది.

తూకాల్లో తేడాలపై సమగ్ర విచారణ ఏదీ?

రేషన్ బియ్యం పేద ప్రజలకు అందాల్సిన హక్కు. సరఫరా దశలోనే తూకాల్లో తేడాలు వస్తున్నాయన్న ఆరోపణలు నిజమైతే, అది ప్రజా పంపిణీ వ్యవస్థలో పర్యవేక్షణ లోపాలను సూచిస్తుంది. గోదాముల నుంచి దుకాణాల వరకు ప్రతి దశలో బరువును తనిఖీ చేయడం, డిజిటల్ తూకాల ద్వారా పారదర్శకతను నిర్ధారించడం, రవాణా వాహనాల వివరాలను పరిశీలించడం అత్యవసరం.

తగ్గిస్తున్నదెవరు? తింటున్నదెవరు?

రేషన్ బియ్యం బస్తాల్లో తూకాల తేడాలకు సంబంధించి గోదాముల సిబ్బంది, రవాణా వ్యవస్థలోని వ్యక్తులు లేదా ఇతరుల ప్రమేయం ఉందా అనే అంశంపై ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే, బాధ్యులు ఎవరనేది అధికారిక విచారణలోనే తేలాలి. సంబంధిత ఉన్నతాధికారులు గోదాములు, ఎంఎల్ఎస్ పాయింట్లు, రేషన్ దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, బియ్యం తూకాల్లో తేడాలకు కారణాలను నిగ్గుతేల్చాలి. అక్రమాలు నిర్ధారణ అయితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. పేదలకు అందాల్సిన రేషన్ బియ్యంలో ఒక్క గింజ కూడా పక్కదారి పట్టకుండా చూడాల్సిన బాధ్యత అధికార యంత్రాంగంపై ఉంది. ప్రజా పంపిణీ వ్యవస్థలో పారదర్శకత మాటల్లోనే కాకుండా క్షేత్రస్థాయిలోనూ కనిపించాలి.

నిల్వలు నిండుగా ఉన్నా కృత్రిమ కొరత

(మొదటి పేజీ తరువాయి)

పెరుగుతున్నాయి. మరో ఆరు నుంచి ఏడు నెలల తర్వాత బియ్యం కొరత ఏర్పడే అవకాశం ఉందనే అంచనాలను సాకుగా చూపుతూ కొందరు వ్యాపారులు ధరలను పెంచుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. బియ్యం రకం, నాణ్యత, ప్రాంతాన్ని బట్టి ప్రస్తుతం కిలో రూ.60 నుంచి రూ.90 వరకు విక్రయిస్తున్నట్లు సమాచారం.

అక్రమ నిల్వలతో కృత్రిమ కొరత సృష్టిస్తున్నారా?

గతంలో రిటైల్ దుకాణాల్లో సన్నబియ్యం కిలో రూ.45 నుంచి రూ.50 వరకు, మెరుగైన రకాల బియ్యం రూ.60 నుంచి రూ.65 వరకు లభించేవి. ప్రస్తుతం మూడు నెలల వ్యవధిలోనే బియ్యం ధరలు 30 నుంచి 40 శాతానికి పైగా పెరిగినట్లు వ్యాపార వర్గాల్లో చర్చ జరుగుతోంది. మార్కెట్లో బియ్యం కొరత ఉందని చెబుతున్నప్పటికీ, నగరాలు, పట్టణాల్లోని పలు దుకాణాల్లో బస్తాల కొద్దీ బియ్యం అందుబాటులో ఉండటం గమనార్హం. మిల్లర్లు, హోల్‌సేల్ వ్యాపారులు భారీగా బియ్యం నిల్వ చేసి కృత్రిమ కొరత సృష్టిస్తున్నారనే ఆరోపణలపై అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

ఆరేళ్లలో రెట్టింపునకు పైగా ధాన్యం ఉత్పత్తి

రాష్ట్రంలో ధాన్యం ఉత్పత్తి గణనీయంగా పెరిగింది. 2019--20లో 72 లక్షల టన్నులుగా ఉన్న ధాన్యం దిగుబడి, 2025--26 నాటికి 148.30 లక్షల టన్నులకు చేరినట్లు గణాంకాలు సూచిస్తున్నాయి. రాష్ట్ర అవసరాలకు మించి ఉత్పత్తి ఉన్నప్పుడు ధరలు స్థిరంగా ఉండాల్సి ఉన్నా, బియ్యం ధరలు పెరుగుతుండటంపై వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఎల్‌నినో ప్రభావం ఇప్పుడే ధరల పెరుగుదలకు సాకుగా మారిందా?

ఎల్‌నినో ప్రభావంతో 2027 ఏప్రిల్ నుంచి జూన్ మధ్య పంట దిగుబడులు తగ్గే అవకాశం ఉందనే అంచనాలు వెలువడుతున్నాయి. పంట కోత అనంతరం ధాన్యాన్ని బియ్యంగా మార్చేందుకు కూడా సమయం పడుతుంది. అయితే భవిష్యత్తులో ఏర్పడవచ్చని భావిస్తున్న కొరతను ప్రస్తుత మార్కెట్ కొరతగా చూపుతూ ధరలు పెంచుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో వాస్తవ నిల్వలు, వినియోగ అవసరాలు, సరఫరా పరిస్థితులను ప్రభుత్వం సమీక్షించాల్సిన అవసరం ఉంది.

వేలంలో కొనుగోలుకు ముందుకు రాని వ్యాపారులు!

గతంలో రాష్ట్ర ప్రభుత్వం మిగులు ధాన్యాన్ని విక్రయించేందుకు సన్న, దొడ్డు రకాలను వేర్వేరుగా విక్రయించే ప్రయత్నాలు చేసింది. సుమారు ఐదు లక్షల టన్నుల సన్న ధాన్యాన్ని వేలం వేయగా, కనీస ధరలకు సైతం కొనుగోలు చేసేందుకు వ్యాపారులు, మిల్లర్లు ముందుకు రాలేదని సమాచారం. అయితే ప్రస్తుతం అదే వర్గాలు బియ్యం ధరలను పెంచుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.ఈ పరిస్థితిలో రైతులకు ధరల పెరుగుదల వల్ల ఎంత మేరకు ప్రయోజనం కలుగుతోంది? వినియోగదారులు మాత్రం అధిక ధరలు చెల్లించాల్సి వస్తోంది. మధ్యలోని సరఫరా వ్యవస్థలో ధరల పెరుగుదలకు కారణాలేమిటో అధికారులు పరిశీలించాల్సిన అవసరం ఉంది.

గోదాముల నుంచి కిరాణా దుకాణాల వరకు నిల్వ

రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేటు రైస్ మిల్లర్లు రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసి, మిల్లింగ్ అనంతరం హోల్‌సేల్ వ్యాపారులకు విక్రయిస్తారు. అక్కడి నుంచి రిటైల్ దుకాణాలకు బియ్యం సరఫరా అవుతుంది. హైదరాబాద్‌లోని కర్మాన్‌ఘాట్ వంటి ప్రాంతాల్లో ప్రైవేటు గోదాముల ద్వారా బియ్యం విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం.

గోదాముల్లో నిల్వలు, రోజువారీ అమ్మకాలు, రిటైల్ దుకాణాల్లో ఉన్న బియ్యం పరిమాణంపై సమగ్ర తనిఖీలు నిర్వహిస్తేనే సరఫరా వ్యవస్థలోని లోపాలు బయటపడే అవకాశం ఉంది. అక్రమ నిల్వలు ఉన్నాయా? ఉంటే వాటి వెనుక ఎవరున్నారు? ధరల పెరుగుదలకు అసలు కారణాలేమిటి? అనే అంశాలపై విచారణ జరగాలి.

నిబంధనలు అమలు చేస్తున్నారా?

ప్రైవేటు బియ్యం వ్యాపారులు కొనుగోళ్లు, మిల్లింగ్, విక్రయాలు, మిగిలిన నిల్వలకు సంబంధించిన రికార్డులను నిర్వహించాల్సి ఉంటుందని పేర్కొంటున్నారు. బియ్యం ఎక్కడి నుంచి తెచ్చారు? ఎంత నిల్వ ఉంది? ఏ ధరకు విక్రయిస్తున్నారు? వంటి వివరాలపై సంబంధిత నిబంధనల ప్రకారం పారదర్శకత ఉండాలి. అయితే ఈ రికార్డుల నిర్వహణ, తనిఖీల అమలుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.ప్రభుత్వం, పౌరసరఫరాల శాఖ, సంబంధిత మార్కెట్ నియంత్రణ అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించి వాస్తవ నిల్వలను వెల్లడించాలి. అక్రమ నిల్వలు, ఉద్దేశపూర్వకంగా సరఫరా నిలిపివేయడం లేదా ఇతర ఉల్లంఘనలు నిర్ధారణ అయితే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి.సామాన్యుడి ప్రశ్న ఒక్కటే.. ధాన్యం ఉత్పత్తి పెరిగినా బియ్యం ధరలు ఎందుకు పెరుగుతున్నాయి? నిల్వలు, సరఫరా, ధరలపై పారదర్శకత కల్పించి వినియోగదారులపై అదనపు భారం పడకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

ఓటును, దేశాన్ని కాపాడుకుందాం!

(మొదటి పేజీ తరువాయి)

సభ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఢిల్లీలోని రాంలీలా మైదానంలో జరిగే ఈ కార్యక్రమంలో విద్యార్థులు, రైతులు, కార్మికులు, మహిళలు, యువత, వ్యాపారులు సహా ప్రజాస్వామ్యంపై విశ్వాసం ఉన్న ప్రతి ఒక్కరూ పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ మేరకు రాహుల్ గాంధీ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు.ఓటర్ల జాబితాల నుంచి పేర్లను తొలగిస్తున్నారని, నిబంధనలు, చట్టాలను ఉల్లంఘిస్తున్నారని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఈ అక్రమాలపై ప్రశ్నలు లేవనెత్తిన వారిపై లాఠీలతో దాడులు చేశారని పేర్కొన్నారు. ఇలాంటి పరిణామాలను ప్రజలు మౌనంగా సహించరని వ్యాఖ్యానించారు. నవంబర్ 1న ఢిల్లీకి తరలివచ్చి ఓటు హక్కును, దేశాన్ని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించే ఉద్యమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. “ఓటు మీది.. పోరాటమూ మీదే” అంటూ తన పోస్టులో పేర్కొన్నారు.

తమ కార్యక్రమానికి విస్తృత ప్రచారం కల్పిస్తున్న బీజేపీ, దాని మిత్రపక్షాలకు వ్యంగ్యంగా కృతజ్ఞతలు తెలిపిన రాహుల్ గాంధీ, ర్యాలీకి ముందు మరో ఏడు రోజులపాటు ఇదే ఉత్సాహంతో ప్రచారం కొనసాగించాలని వ్యాఖ్యానించారు.

మూడు రోజులపాటు ఢిల్లీలోనే ఎంపీలు

ర్యాలీ నేపథ్యంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పార్టీ ఎంపీలకు కీలక సూచనలు చేశారు. అక్టోబర్ 30, 31, నవంబర్ 1 తేదీల్లో ఎంపీలంతా ఢిల్లీలో అందుబాటులో ఉండాలని కోరారు. ఎన్నికల ప్రక్రియలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలు, ఓటర్ల జాబితాల నుంచి పేర్ల తొలగింపును నిరసిస్తూ చేపట్టే కార్యక్రమాల్లో ఎంపీల భాగస్వామ్యాన్ని నిర్ధారించేందుకు కాంగ్రెస్ నాయకత్వం ఈ నిర్ణయం తీసుకుంది.అక్టోబర్ 30న ఢిల్లీలోని అశోకా హోటల్ వేదికగా విపక్షాలు మాక్ పార్లమెంట్ నిర్వహించనున్నట్లు సమాచారం. ఎన్నికల ప్రక్రియలో అక్రమాల ఆరోపణలపై చర్చించడంతోపాటు, సంబంధిత అంశాలపై రాజకీయంగా నిరసన వ్యక్తం చేయాలని విపక్షాలు భావిస్తున్నాయి. ఇండియా కూటమికి చెందిన ఎంపీలు, అగ్రనేతలు ఈ సమావేశంలో పాల్గొననున్నారు.

మాక్ పార్లమెంట్ అనంతరం నవంబర్ 1న రాంలీలా మైదానం కేంద్రంగా భారీ ర్యాలీ నిర్వహించేందుకు కాంగ్రెస్ ఏర్పాట్లు చేస్తోంది. ఈ కార్యక్రమానికి పది లక్షల మంది వరకు హాజరయ్యేలా జన సమీకరణ చేపట్టాలని పార్టీ లక్ష్యంగా పెట్టుకున్నట్లు సమాచారం.

రామమందిర విరాళాలపై జైరాం రమేశ్ ప్రశ్నలు

అయోధ్యలోని శ్రీరామ జన్మభూమి ఆలయానికి వచ్చిన విరాళాలు, కానుకల లెక్కలపై కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ మరోసారి ప్రశ్నలు లేవనెత్తారు. ప్రధాని నరేంద్ర మోదీ ఉత్తరప్రదేశ్ పర్యటన నేపథ్యంలో ఈ అంశాన్ని ప్రస్తావించిన ఆయన, విరాళాల వ్యవహారంపై నిష్పక్షపాత దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. ఆలయ ట్రస్టీల నియామకంపైనా అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ, బీజేపీ, విశ్వహిందూ పరిషత్, ఆర్ఎస్ఎస్‌తో సంబంధాలున్న వ్యక్తులకు ప్రాధాన్యం ఇచ్చారని ఆరోపించారు.2021లో నిర్వహించిన నిధి సమర్పణ కార్యక్రమం, కార్పస్ విరాళాల ద్వారా మొత్తం రూ.3,264 కోట్లు సేకరించినట్లు ఆర్ఎస్ఎస్, ఆలయ ట్రస్టు వెల్లడించిన గణాంకాలను జైరాం రమేశ్ ప్రస్తావించారు.

అలాగే, అయోధ్యకు వచ్చిన భక్తుల సంఖ్యకు, హుండీలు, కౌంటర్ల ద్వారా వచ్చిన కానుకల మొత్తానికి మధ్య ఉన్న వ్యత్యాసంపై స్పష్టత ఇవ్వాలని కోరారు.2024లో తొమ్మిది నెలల వ్యవధిలో 13.55 కోట్ల మంది భక్తులు అయోధ్యను సందర్శించారని, 2025 మహాకుంభమేళా సమయంలో మరో పది కోట్ల మంది వరకు సందర్శించారని ఆయన పేర్కొన్నారు. 2025 ఏప్రిల్ 1 నుంచి 2026 ఫిబ్రవరి 28 వరకు సుమారు 16 కోట్ల మంది భక్తులు వచ్చినట్లు చెబుతున్నప్పటికీ, హుండీలు, కౌంటర్ల ద్వారా రూ.82.78 కోట్ల కానుకలు మాత్రమే వచ్చినట్లు కొన్ని నివేదికలు పేర్కొంటున్నాయని తెలిపారు.ఈ గణాంకాల మధ్య ఉన్న వ్యత్యాసానికి కారణాలేమిటో వెల్లడించాలని, విరాళాల లెక్కలపై పారదర్శకత పాటించాలని జైరాం రమేశ్ డిమాండ్ చేశారు. అయితే, ఈ ఆరోపణలపై సంబంధిత ఆలయ ట్రస్టు వివరణ, అధికారిక లెక్కలు పరిశీలించిన తర్వాతే పూర్తి వివరాలు నిర్ధారించాల్సి ఉంటుంది.

తెలంగాణలో వ్యవసాయానికి 12 గంటల విద్యుత్ సరఫరా!

(మొదటి పేజీ తరువాయి)

మార్కెట్‌లోనూ విద్యుత్ కొరత

పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్‌ను మార్కెట్‌లో కొనుగోలు చేయాలన్నా అవసరమైనంత అందుబాటులో ఉండటం లేదని డిస్కంలు పేర్కొన్నాయి. సెప్టెంబర్ 7 నుంచి అక్టోబర్ 15 వరకు రాష్ట్రంలో రోజుకు సగటున 3 కోట్ల యూనిట్ల విద్యుత్ కొరత ఏర్పడినట్లు నివేదికలో వెల్లడించాయి. సెప్టెంబర్ 8న అత్యధికంగా 3.64 కోట్ల యూనిట్ల కొరత నమోదైనట్లు తెలిపాయి.వర్షాలు సరిగా కురవకపోవడంతో శ్రీశైలం, నాగార్జునసాగర్ జల విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తి తగ్గడం పరిస్థితిని మరింత తీవ్రతరం చేసిందని పేర్కొన్నాయి. గత ఏడాది అక్టోబర్‌లో జల విద్యుత్ ఉత్పత్తి 138.30 కోట్ల యూనిట్లుగా ఉండగా, ఈ ఏడాది అక్టోబర్‌లో 14.4 కోట్ల యూనిట్లకు పడిపోయినట్లు నివేదికలో వివరించాయి.

విద్యుత్ పొదుపుపై దృష్టి

రానున్న రోజుల్లో నిరంతర విద్యుత్ సరఫరా కోసం మరిన్ని సవాళ్లు ఎదురయ్యే అవకాశం ఉందని డిస్కంలు హెచ్చరించాయి. పగటిపూట సౌర విద్యుత్ ఉత్పత్తి అందుబాటులో ఉన్నప్పటికీ, రాత్రి, తెల్లవారుజామున విద్యుత్ కొరత ఏర్పడుతోందని తెలిపాయి.వ్యవసాయంలో తక్కువ నీటితో సాగయ్యే వర్షాధార పంటలను ప్రోత్సహించడం, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల్లో విద్యుత్ పొదుపు విధానాలను అమలు చేయడం, ఇళ్లు, అపార్ట్‌మెంట్లలో తక్కువ విద్యుత్ వినియోగించే ఉపకరణాలను ఉపయోగించేలా ప్రజలకు అవగాహన కల్పించడం అవసరమని సూచించాయి. పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా ముందుగానే విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు చేసుకోవడంపై దృష్టి పెట్టాలని డిస్కంలు ప్రభుత్వానికి సూచించాయి.

రాజీవ్ చౌక్‌లో కల్వర్టు, డ్రైనేజీ పనుల పరిశీలన

● త్వరగా పూర్తి చేయాలని ఆదేశాలు

టీ మీడియా, అక్టోబర్ 24, రామకృష్ణాపూర్:

క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని రామకృష్ణాపూర్ రాజీవ్ చౌక్‌లో జరుగుతున్న కల్వర్టు, డ్రైనేజీ పనులను శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ గోడిసెల సంధ్యారాణి పరిశీలించారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకుడు డాక్టర్ రాజా రమేష్ మాట్లాడుతూ, పనుల కారణంగా మరో రెండు మూడు రోజుల పాటు ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని, ప్రజలు సహకరించాలని కోరారు. అదేవిధంగా ప్రతి దుకాణానికి డ్రైనేజీ లైన్ సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు రామిడి కుమార్, యువ నాయకులు



రామిడి లక్ష్మీకాంత్, నస్పూరి శివకుమార్, స్థానిక దుకాణ యజమానులు తదితరులు పాల్గొన్నారు.

సంఘం ఆధ్వర్యంలోనే సంపూర్ణ భద్రత!

● గ్రామీణ వైద్యుల సమస్యలను పరిష్కరించాలి

టీ మీడియా, అక్టోబర్ 25, ముదిగొండ:

మారుమూల ప్రాంతాల్లో పనిచేస్తున్న గ్రామీణ వైద్యుల సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘాన్ని స్థాపించినట్లు సంఘం ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల అధ్యక్షుడు పిట్టల నాగేశ్వరరావు తెలిపారు. సంఘం ఆధ్వర్యంలోనే ఆర్ఎంపీలకు అండగా నిలిచి, వారి సంక్షేమం కోసం కృషి చేస్తామని పేర్కొన్నారు. ప్రతి ఆర్ఎంపీ గ్రామాల్లో ప్రజలకు ప్రాథమిక వైద్య సేవలు మాత్రమే అందించాలని సూచించారు.ఆదివారం ఖమ్మం జిల్లా ముదిగొండ మండల పరిధిలోని వనంవారి కిష్టాపురంలో గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం ముదిగొండ మండల ఏడవ మహాసభ నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు పిట్టల నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో గ్రామీణ వైద్యులకు పారామెడికల్ బోర్డు ద్వారా శిక్షణ ఇచ్చేందుకు బడ్జెట్ విడుదల చేసి, కొంతమందికి జిల్లాలవారీగా శిక్షణ ప్రారంభించారని గుర్తుచేశారు. అయితే, ఆయన అకాల మరణంతో శిక్షణ కార్యక్రమం మధ్యలోనే నిలిచిపోయిందన్నారు.నాటి నుంచి నేటి వరకు ప్రభుత్వాలు మారుతున్నప్పటికీ గ్రామీణ వైద్యుల శిక్షణను పూర్తిచేసి సర్టిఫికెట్లు అందజేయకపోవడం బాధాకరమన్నారు. ప్రస్తుత



కాంగ్రెస్ ప్రభుత్వం తన ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా ఆర్ఎంపీలకు పూర్తిస్థాయి శిక్షణ ఇచ్చి, సర్టిఫికెట్లు అందజేయాలని కోరారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి శిక్షణ పూర్తి చేయడంతో పాటు ప్రభుత్వ పథకాల అమలులో గ్రామీణ వైద్యులను భాగస్వాములను చేస్తే మారుమూల గ్రామాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.

ప్రాథమిక వైద్యానికే పరిమితం కావాలి

గ్రామాల్లో నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్న ఆర్ఎంపీలు ప్రాథమిక వైద్యానికే పరిమితం కావాలని పిట్టల నాగేశ్వరరావు సూచించారు. నిబంధనలను అతిక్రమించి తీవ్రమైన అనారోగ్య సమస్యలకు చికిత్స చేయకూడదని స్పష్టం చేశారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రాథమిక సహాయం అందించి, బాధితులను వెంటనే అర్హత కలిగిన వైద్యుల వద్దకు లేదా సంబంధిత ఆసుపత్రులకు తరలించాలని సూచించారు. ప్రజలకు మెరుగైన సేవలందిస్తూ వారి మన్ననలు పొందాలని పిలుపునిచ్చారు.సమావేశం అనంతరం పలువురు మండల అధ్యక్షులను శాలువాలతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు నెమలికొండ మణికుమార్, నారపోగు సుదర్శన్, జిల్లా సహాయ కార్యదర్శులు పెద్ద భాస్కర్, వట్టికూటి ఉపేందర్, ముదిగొండ మండల అధ్యక్షుడు నేరెళ్ల నరసింహారావు, కార్యదర్శి కాంచాని శ్రీనివాస యాదవ్, నాయకులు పి. అప్పారావు, వెంకట నరసయ్య, వర్ధన్ రాజు, పి. మోహనరావు, నాగేశ్వరరావు, పి. రాజశేఖర్, వెంకటేశ్వరరావు, షేక్ సొందు సాహెబ్, ఎం.డి. ఖలీల్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి



⏭ వై.ఆర్.జి. కేర్ సూపర్‌వైజర్ నరేష్

టీ మీడియా, అక్టోబర్ 25, ఖమ్మం రూరల్:

ఖమ్మం రూరల్ మండల పరిధిలోని అరేకోడు గ్రామంలో హెచ్ఐవీపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వై.ఆర్.జి. కేర్ సూపర్‌వైజర్ కర్లకుంట నరేష్ మాట్లాడుతూ హెచ్ఐవీ ఎలా వ్యాపిస్తుంది, దాని నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు.సురక్షితం కాని లైంగిక సంబంధాలు, కలుషిత రక్తం ఎక్కించడం, కలుషిత సూదులు, సిరంజీలను ఉపయోగించడం, హెచ్ఐవీ ఉన్న తల్లి నుంచి బిడ్డకు వైరస్ సంక్రమించడం వంటి ప్రధాన మార్గాల ద్వారా హెచ్ఐవీ వ్యాపిస్తుందని తెలిపారు. హెచ్ఐవీ సోకిన వారిని వివక్షతో చూడకూడదని, వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు.ఏఆర్‌టీ మందులు వినియోగిస్తున్న హెచ్ఐవీ బాధితులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి కూడా వివరించారు. 18 ఏళ్ల నిండిన వారు సహా అవసరమైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా హెచ్ఐవీ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. హెచ్ఐవీ నివారణకు ముందస్తు జాగ్రత్తలు పాటించడం, వైద్యుల సూచనలను అనుసరించడం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ఆరెంపుల రమాదేవి మాట్లాడుతూ గ్రామంలోని ప్రజలు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని, సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆరెంపుల రమాదేవి, ఆశా కార్యకర్త నాగమణి, మాజీ సర్పంచ్ ఉప్పుగండ్ల వెంకటనారాయణ, వై.ఆర్.జి. లింక్ వర్కర్ కౌసల్య, మల్లేల వీరయ్య, రామకృష్ణ, పాపారావు, రవి తదితరులు పాల్గొన్నారు. గ్రామ ప్రజలు కూడా ఈ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు.

చేపల వేటకు వెళ్లిన వ్యక్తి మృతి



టీ మీడియా, అక్టోబర్ 25, కూసుమంచి:

ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం నేలపట్ల గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది. చేపల వేటకు వెళ్లిన చెన్నబోయిన రాజేష్ (34) అనే వ్యక్తి చెరువులో నీట మునిగి మృతి చెందాడు.గ్రామానికి చెందిన రాజేష్ శనివారం రాత్రి గ్రామ సమీపంలోని చెరువులో చేపల వేటకు వెళ్లాడు. ఎంతసేపటికీ ఇంటికి తిరిగి రాకపోవడంతో ఆందోళనకు గురైన తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు అతని కోసం గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో చెరువు గట్టుపై రాజేష్ చెప్పులు కనిపించడంతో చెరువులో వెతకడం ప్రారంభించారు.ఆదివారం తెల్లవారుజామున చెరువులో రాజేష్ మృతదేహం లభ్యమైంది. సమాచారం అందుకున్న కూసుమంచి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.రాజేష్ మృతికి గల పూర్తి కారణాలు తెలియాల్సి ఉంది. ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం




⏭ ఖోడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి

టీ మీడియా , అక్టోబర్ 25 ।,నారాయణఖేడ్:

నారాయణఖేడ్ నియోజకవర్గంలోని తండాలు, గ్రామాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ చేపట్టిన పనులను ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి ఆదివారం ప్రారంభించారు. నాగల్‌గిద్ద మండల పరిధిలోని ఇరాక్‌పల్లి మెగా నాయక్ తండాలో నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ వేడుకల్లో పాల్గొని, లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం వివిధ తండాల్లో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. ఇరాక్‌పల్లి మెగా నాయక్ తండాలో రూ.8.50 లక్షల వ్యయంతో, కిషన్ నాయక్ తండాలో రూ.15 లక్షల వ్యయంతో, కారోబరి తండాలో రూ.10 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు.కిషన్ నాయక్ తండాలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న స్మార్ట్ రేషన్ కార్డులను అర్హులైన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్డుల ద్వారా రేషన్ సరుకుల పంపిణీ మరింత సులభతరం కావడంతోపాటు, అర్హులైన కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించడంలో దోహదపడుతుందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి మాట్లాడుతూ, ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు కల్పించాలనే లక్ష్యంతో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేందుకు సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు.తండాలు, గ్రామాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడంతోపాటు, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని స్పష్టం చేశారు. ప్రజల అవసరాలను గుర్తించి అభివృద్ధి పనులను దశలవారీగా చేపడుతూ నారాయణఖేడ్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమాల్లో స్థానిక సర్పంచులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, సంబంధిత అధికారులు, తండాల ప్రజలు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు పాల్గొన్నారు.

పలు కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



టీ మీడియా, అక్టోబర్ 25, నారాయణఖేడ్:

సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గంలోని మనూర్ మండలం ఎల్గోయి, రానాపూర్ గ్రామాలకు చెందిన పలువురు ఇటీవల మృతి చెందడంతో నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ రెడ్డి వారి కుటుంబాలను పరామర్శించారు.ఎల్గోయి గ్రామానికి చెందిన అజీమ్ మియా తల్లి, నాందేవ్ తల్లి, నాగిరెడ్డి తండ్రి, రానాపూర్ గ్రామానికి చెందిన గోపాల్ తల్లి మృతి చెందిన విషయం తెలుసుకున్న ఆయన ఆయా కుటుంబాల నివాసాలకు వెళ్లారు. మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ ధైర్యం చెప్పారు.ఈ పరామర్శ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు విఠల్ రావు పటేల్, సర్పంచ్ కృష్ణ, మాజీ సర్పంచ్ సుధాకర్, మాజీ ఎంపీటీసీ సంజీవులు, గ్రామ పార్టీ అధ్యక్షుడు చంద్రకాంత్, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ర్యాకల గోపాల్, పట్టణ పార్టీ అధ్యక్షుడు నగేష్ సెట్, నాయకులు బసుగోండ, గోపాల్ రెడ్డి, విశ్వనాథరావు, ఇస్మాయిల్, శ్రీకాంత్, జైపాల్, రామ్ రెడ్డి, గోపాల్ రెడ్డి, అజీమ్ మియా, కుదుస్ తదితరులు పాల్గొన్నారు.

పర్మిట్లు తక్కువ.. తవ్వకాలు ఎక్కువ!



⏭ ఆరేకోడు సమీపంలో మట్టిపై అనుమానాలు

టీ మీడియా ,అక్టోబర్ 25 ।,ఖమ్మం రూరల్:

పొన్నెల్లు నుంచి కొరివి వైపు వెళ్లే ఎన్‌హెచ్ఏఐ రహదారి నిర్మాణ పనుల్లో భాగంగా ఖమ్మం రూరల్ మండల పరిధిలోని ఆరేకోడు సమీపంలో జరుగుతున్న మట్టి తవ్వకాలపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మట్టి తవ్వకాలకు తీసుకున్న అనుమతులు ఒక పరిమితికి మాత్రమే ఉన్నాయా? క్షేత్రస్థాయిలో మాత్రం అంతకుమించి తవ్వకాలు జరుగుతున్నాయా? అన్న ప్రశ్నలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి.

అనుమతులకు.. తవ్వకాలకు పొంతన ఉందా?

ప్రభుత్వ నిబంధనల ప్రకారం మట్టి తవ్వకాలకు అవసరమైన అనుమతులు పొందడంతోపాటు, అనుమతించిన ప్రదేశంలో నిర్ణీత పరిమాణంలోనే తవ్వకాలు చేపట్టాలి. అయితే ఆరేకోడు సమీపంలో జరుగుతున్న తవ్వకాల పరిమాణం, సంబంధిత శాఖలు జారీ చేసిన అనుమతుల్లో పేర్కొన్న పరిమితులకు అనుగుణంగా ఉందా? అనే అంశంపై స్పష్టత రావాల్సి ఉంది.


ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోందా?

అనుమతించిన పరిమాణానికి మించి తవ్వకాలు జరిగినట్లు తేలితే, వర్తించే సీనరేజ్ ఛార్జీలు, ఇతర రుసుముల రూపంలో ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయంపై ప్రభావం పడే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో వాస్తవ పరిస్థితులను నిర్ధారించేందుకు సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో సమగ్ర పరిశీలన చేపట్టాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

పర్మిట్లు, రవాణా వివరాలపై తనిఖీలు చేయాలి!

మైనింగ్, రెవెన్యూ శాఖల అధికారులు తక్షణమే స్పందించి తవ్వకాలు జరుగుతున్న ప్రాంతాన్ని పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు. జారీ చేసిన పర్మిట్లు, అనుమతించిన మట్టి పరిమాణం, వాస్తవంగా జరిగిన తవ్వకాలు, తరలించిన మట్టి వివరాలు, చెల్లించిన రుసుములు, వర్తించే రవాణా అనుమతులను తనిఖీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.నిబంధనల ఉల్లంఘనలు జరిగినట్లు ఆధారాలతో నిర్ధారణ అయితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నామకరణ లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే



టీ మీడియా ,అక్టోబర్ 25 ,నారాయణఖేడ్:

నిజాంపేట్ మండలం నాగ్ధర్ గ్రామానికి చెందిన నారాయణ సేటు మనమరాలి నామకరణ మహోత్సవ కార్యక్రమానికి హాజరై చిన్నారుని ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేసిన నారాయణఖేడ్ మాజీ శాసనసభ్యులు మహారెడ్డి భూపాల్ రెడ్డి వారితోపాటు మండల పార్టీ అధ్యక్షులు విఠల్ రావు పటేల్,మున్సిపల్ కౌన్సిలర్ అభిషేక్ షెట్కార్, పిఏసియస్ చైర్మన్ నరసింహారెడ్డి,పట్టణ పార్టీ అధ్యక్షులు నగేష్ సెట్ మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ర్యాకల గోపాల్, వీరేషం సెట్, నర్సింలు తదితరులు ఉన్నారు.

ఓటు హక్కు పరిరక్షణకు ఉద్యమించాలి!

⏭ సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కే. నరేంద్ర

టీ మీడియా, అక్టోబర్ 25, సింగరేణి (కారేపల్లి):

ఓటు హక్కుతో పాటు రాజ్యాంగం కల్పించిన ప్రజాస్వామిక హక్కుల పరిరక్షణ కోసం ప్రజలు ఐక్యంగా ఉద్యమించాలని సీపీఐ(ఎం) సింగరేణి మండల కార్యదర్శి కే. నరేంద్ర పిలుపునిచ్చారు. శనివారం బాజుమల్లాయిగూడెంలో సీపీఐ(ఎం) సీనియర్ నాయకుడు, పోడు భూముల పోరాట యోధుడు కామ్రేడ్ మద్దెల నరసయ్య 21వ వర్ధంతి సభను శాఖ కార్యదర్శి వల్లెబోయిన కొండలరావు అధ్యక్షతన నిర్వహించారు.ఈ సందర్భంగా నరేంద్ర మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ వంటి రాజ్యాంగ సంస్థల స్వతంత్రతను కాపాడాల్సిన అవసరం ఉందన్నారు. ఓటర్ల జాబితాల నుంచి పెద్ద సంఖ్యలో ఓట్లు తొలగిస్తున్నారంటూ ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ప్రతిపక్షాల మద్దతుదారులు, మైనారిటీలు, వలస కార్మికుల ఓటు హక్కుకు భంగం కలిగే పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆరోపించారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా సాగాలని డిమాండ్ చేశారు.అంతకుముందు స్మారక స్థూపం వద్ద సీపీఐ(ఎం) సీనియర్ నాయకుడు మెరుగు రాములు పార్టీ జెండాను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో మద్దెల పుల్లారావు, అజ్మీర శోభన్‌బాబు, యనమనగండ్ల రవిబాబు, ధరావత్ వినోద్‌కుమార్, మన్నెం బ్రహ్మయ్య, రాసబంటి పుల్లయ్య, షేరు వెంకటేశ్వర్లు, చేరు లలితమ్మ, భానోత్ వెంకటేష్, మాలోతు హనుమ, సురభి నరేష్, మాచర్ల రమేష్, కోరం రంగయ్య తదితరులు పాల్గొన్నారు.



మన్ కీ బాత్ కార్యక్రమం

టీ మీడియా, అక్టోబర్ 25, పెబ్బేరు:

వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణ కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిర్వహించే మన్ కీ బాత్ కార్యక్రమాన్ని బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఆసక్తిగా వీక్షించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు వినోద్ సాగర్ మోడలా, వనపర్తి జిల్లా బీజేవైఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కుబేర్ నాయుడు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేనేత కార్మికుల కృషి, స్వదేశీ ఉత్పత్తుల ప్రాధాన్యత, దేశ అభివృద్ధి తదితర అంశాలపై చేసిన ప్రసంగాన్ని నాయకులు, కార్యకర్తలు ఆసక్తిగా విన్నారు.అనంతరం నాయకులు మాట్లాడుతూ.. మన్ కీ బాత్ కార్యక్రమం ద్వారా ప్రధాని మోదీ దేశ ప్రజలతో తన ఆలోచనలను పంచుకుంటున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా వెల్లడించే సందేశాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని ప్రతి కార్యకర్తకు పిలుపునిచ్చారు.

భారీ వర్షాలు కురిసే అవకాశం



⏭ జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

టీ మీడియా, అక్టోబర్ 25, ఖమ్మం:

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఖమ్మం జిల్లాలో రానున్న మూడు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.భారత వాతావరణ శాఖ అక్టోబర్ 25న జారీ చేసిన వాతావరణ బులెటిన్ ప్రకారం ఈ నెల 27న జిల్లాలో అక్కడక్కడా ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు.అక్టోబర్ 28న జిల్లాలో అక్కడక్కడా భారీ నుంచి అతి భారీ వర్షాలతో పాటు అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ హెచ్చరించిందని పేర్కొన్నారు. అక్టోబర్ 29న కూడా అక్కడక్కడా ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని తెలిపారు.వర్షాల నేపథ్యంలో రైతులు అవసరమైన ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.

అప్రమత్తంగా ఉండాలి

ఉరుములు, మెరుపులు సంభవించే సమయంలో ప్రజలు బహిరంగ ప్రదేశాల్లో ఉండరాదని, చెట్ల క్రింద, విద్యుత్ స్తంభాల సమీపంలో ఆశ్రయం పొందరాదని కలెక్టర్ సూచించారు. జిల్లాలోని సంబంధిత శాఖల అధికారులు వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. వాతావరణ శాఖ హెచ్చరికలు, జిల్లా యంత్రాంగం జారీ చేసే సూచనలను ప్రజలు, రైతులు తప్పనిసరిగా పాటించాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ఖమ్మం మేయర్ పదవే లక్ష్యం



⏭ మున్నూరు కాపులకు

ఆర్ జె సి కృష్ణ పిలుపు

టీ మీడియా ,అక్టోబర్ 25 , ఖమ్మం, :

రాబోయే ఖమ్మం కార్పొరేషన్ ఎన్నికల్లో ఇతర కులాలను కలుపుకొని పోతూ, మేయర్ పదవిని ప్రధాన లక్ష్యంగా చేసుకుని మున్నూరు కాపులను ఒక గొప్ప రాజకీయ శక్తిగా తీర్చిదిద్దాలి" అని ఆర్ జె సి కృష్ణ పిలుపునిచ్చారు. ఆదివారం ఆర్ జే సీ కృష్ణ నివాసంలో అయన అధ్యక్షతన జరిగిన కొండా దేవయ్య కాపు సంఘం జిల్లా ముఖ్య నాయకుల సమావేశంలో అయన మాట్లాడారు.కొండా దేవయ్య నాయకత్వంలోని మున్నూరు కాపు సంఘాన్ని అతి త్వరలోనే విస్తృతపరుస్తామని శెట్టి రంగారావు స్పష్టం చేశారు.సుడా మాజీ చైర్మన్ బచ్చు విజయకుమార్ మాట్లాడుతూ.. సంఘం అనేది సరైన నిర్మాణంతో సాగాలని, మున్నూరు కాపుల చరిత్ర తెలియని వారి చేతుల్లోకి వెళ్లకుండా, కేవలం వ్యక్తి ఆరాధనలకు లేదా మూడు కుటుంబాల పాలనకు పరిమితమయ్యే సంస్థగా మారకూడదని అన్నారు.గత పదేళ్లపాటు ఈ సంఘాన్ని పూర్తిగా నిర్వీర్యం చేశారని లక్కినేని సుధీర్ ఆవేదన వ్యక్తం చేశారు.సంఘం కేవలం ఖమ్మం పట్టణానికే పరిమితం కాకుండా జిల్లావ్యాప్తంగా విస్తరించాలని రాపర్తి శరత్ సూచించగా, సేవా రంగంలోనూ మన సంఘాన్ని ముందు వరుసలో నిలపాలని పొన్నం వెంకటేశ్వర్లు కోరారు. ఈ కార్యక్రమంలో కనిశెట్టి నరసయ్య, సాగర్, పిన్ని కోటేశ్వరరావు, మాటేటి కిరణ్, లక్కినేని సుధీర్ శ్రీదేవి, పసుపులేటి నాగరాజు, ఎర్ర జ్ఞానేశ్, రియల్ ఎస్టేట్ అధ్యక్షుడు వరప్రసాద్, నాలం సతీష్, గుండెపునేని రాజా తాళ్ళూరి రవి, మేకల శంకర్ బాబు, ఎండిఓ రవి, ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను పరామర్శించిన మున్సిపల్ చైర్మన్



టీ మీడియా ,అక్టోబర్ 25 , మంథని:

మంథని మున్సిపల్ చైర్మన్ వొడ్నాల శ్రీనివాస్(మున్సిపల్ వైస్ చైర్మన్ ముస్కుల సహేందర్ రెడ్డి, పాలకవర్గ సభ్యులు కుర్ర లింగయ్య, ఎల్లంకి వంశీధర్‌లతో కలిసి వివిధ ప్రాంతాల్లో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా కమాన్‌పూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వైనాల రాజు తండ్రి వైనాల సాంబయ్య, బోయినిపేటకు చెందిన సొల్ల లక్ష్మి, బేగంపేటకు చెందిన ముత్తే అరవింద్ కళ్యాణ్, అంబేద్కర్ నగర్‌కు చెందిన బూడిద శంకర్ మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను కలిసి ఓదార్చారు.ఈ సందర్భంగా మృతుల కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ, కష్టకాలంలో మనోధైర్యంతో ఉండాలని సూచించారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు ఈ బాధను తట్టుకునే శక్తిని ప్రసాదించాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో నాయకులు జంభోజు సమ్మయ్య, గౌతమేశ్వర స్వామి దేవాలయ చైర్మన్ గుండా రాజు తదితరులు పాల్గొన్నారు.

నీటి కుంటలో ముగ్గురి జలసమాధి!



టీ మీడియా ,అక్టోబర్ 25 , జైపూర్:

మంచిర్యాలజైపూర్ మండలం ఇందారం గ్రామ శివారులో విషాదం చోటుచేసుకుంది. బట్టలు ఉతికేందుకు నీటి కుంటలో దిగిన ముగ్గురు వలస వ్యాపారులులోతు అంచనా వేయలేక నీటిలో మునిగి ప్రాణాలు కోల్పోయారు. వ్యాపారం కోసం గ్రామానికి వచ్చి తాత్కాలికంగా నివాసం ఉంటున్న వీరు ఆదివారం మధ్యాహ్నం మృత్యువాత పడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను వెలికితీసి, పోస్టుమార్టం నిమిత్తం మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి(తరలించారు. ఈ ఘటనతో ఇందారం గ్రామంలోవిషాదం అలుముకుంది

అయ్యప్ప స్వాములకు అన్నప్రసాద వితరణ



టీ మీడియా, అక్టోబర్ 25, పెబ్బేరు:

వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణ పరిధిలోని మిట్ట హనుమాన్ దేవాలయంలో అయ్యప్ప స్వామి మాలధారణ చేసిన భక్తుల కోసం అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మేకల ఎల్లయ్య గురుస్వామి, పండితులు గోవర్ధనాచార్యుల సౌజన్యంతో, మిట్ట హనుమాన్ దేవాలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.అయ్యప్ప స్వామి దీక్ష ఆధ్యాత్మికత, నియమనిష్ఠలు, భక్తిభావానికి ప్రతీకగా నిలుస్తుందని భక్తులు విశ్వసిస్తారు. మాలధారణ చేసిన స్వాములు మండల కాలం పాటు కఠిన నియమాలను పాటిస్తూ, నిత్యం స్వామి నామస్మరణ, భజనలు, పూజలు చేస్తూ దీక్షను కొనసాగిస్తారు.ఈ క్రమంలో దీక్ష చేపట్టిన అయ్యప్ప స్వాములకు అన్నప్రసాదం అందించడం పవిత్రమైన సేవగా భావిస్తారు. ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం, భక్తులకు సేవ చేయడం ద్వారా ఆధ్యాత్మిక తృప్తి లభిస్తుందని భక్తుల నమ్మకం. అన్నదానం కేవలం ఆహారాన్ని అందించడమే కాకుండా మానవత్వం, సమానత్వం, సేవాభావానికి ప్రతీకగా నిలుస్తుందని పలువురు పేర్కొంటున్నారు.ఈ కార్యక్రమంలో అయ్యప్ప మాలధారణ స్వాములు, మిట్ట హనుమాన్ దేవాలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కూటమి గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



⏭ డీవీఎస్ రమణారెడ్డి

టీ మీడియా , అక్టోబర్ 25 , చింతూరు:

కూనవరం మండలంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి బీజేపీ కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డీవీఎస్ రమణారెడ్డి పిలుపునిచ్చారు. కూటమి పార్టీలతో సమన్వయం చేసుకుంటూ ఇంటింటా ప్రచారం నిర్వహించి ప్రజలకు తమ అభివృద్ధి కార్యక్రమాలను వివరించాలని సూచించారు.పెద్దార్కూరు గ్రామంలో కూనవరం మండల బీజేపీ అధ్యక్షుడు కరక పవన్ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూనవరం మండలంలో తెలుగుదేశం పార్టీకి కేటాయించిన ఐదు ఎంపీటీసీ స్థానాలు, జనసేన పార్టీకి కేటాయించిన రెండు ఎంపీటీసీ స్థానాలు, బీజేపీకి కేటాయించిన జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల్లో కూటమి అభ్యర్థుల విజయానికి పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని కోరారు.పోలవరం నిర్వాసితులకు న్యాయం చేసే దిశగా కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన పేర్కొన్నారు. 41వ కాంటూర్ పరిధిలోని నిర్వాసితులకు ప్యాకేజీ అందించామని, 45వ కాంటూర్ పరిధిలోని నిర్వాసితులకు కూడా న్యాయం జరిగేలా కృషి చేస్తామని తెలిపారు. కూనవరం మండల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ద్వారా మరిన్ని నిధులు తీసుకొచ్చి రహదారులు, రైల్వే లైన్లు, నీటిపారుదల, విద్య, వైద్య రంగాలను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని ప్రజలకు వివరించాలని సూచించారు.ఈ సమావేశంలో బీజేపీ సీనియర్ నాయకుడు కుంజా చంద్రయ్య, మహిళా మండల అధ్యక్షురాలు సోయం సుధారాణి, గిరిజన సంఘం సీనియర్ నాయకులు తుర్రం అశోక్ కుమార్, పాయం వెంకన్నబాబు, చిచ్చుడి నారాయణ, చిచ్చుటి ప్రసాద్, మడకం కన్నయ్య, బీవీఎస్ నారాయణ, పూనం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పశువుల సంత నిర్వహణ కు బహిరంగ వేలం



⏭ నవంబర్ 5న వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో

టీ మీడియా ، అక్టోబర్ 25 ، కారేపల్లి (సింగరేణి):

ఖమ్మం జిల్లా సింగరేణి మండలం కారేపల్లి గ్రామంలోని శ్రీశ్రీశ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం పరిధిలో ప్రతి ఆదివారం నిర్వహించే పశువుల సంత నిర్వహణ హక్కులను సీల్ టెండర్ కమ్ బహిరంగ వేలం ద్వారా కేటాయించనున్నట్లు దేవస్థానం అధికారులు ప్రకటించారు.నవంబర్ 5, 2026న ఉదయం 11 గంటలకు దేవస్థానం ముఖ మండపంలో దేవాదాయ శాఖ అధికారుల సమక్షంలో వేలం నిర్వహించనున్నారు. వేలంలో పాల్గొనదలచిన వారు రూ.50 వేల డిపాజిట్‌ను డీడీ రూపంలో చెల్లించాలి. సీల్ టెండర్లను నవంబర్ 3వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు స్వీకరిస్తారు. నవంబర్ 5న ఉదయం 10.30 గంటల వరకు బహిరంగ వేలంలో పాల్గొనేందుకు అవకాశం కల్పించనున్నారు. వేలం షెడ్యూల్ ధరను రూ.500గా నిర్ణయించారు.వేలంలో అత్యధిక ధరకు పాట పాడిన వ్యక్తికి మాత్రమే లైసెన్స్ హక్కులు కేటాయిస్తారు. హక్కులు పొందిన వారికి 2026 నవంబర్ 5 నుంచి 2027 నవంబర్ 4 వరకు ఏడాది పాటు పశువుల సంత నిర్వహణ బాధ్యతలు ఉంటాయి. వేలంలో నిర్ణయించిన మొత్తాన్ని నిబంధనల ప్రకారం దేవస్థానానికి చెల్లించాలి.

వసూళ్లకు రుసుములు ఖరారు

పశువుల సంతలో వసూలు చేయాల్సిన రుసుములను దేవస్థానం నిర్ణయించింది. పశువులను విక్రయించే వారు రూ.100, కొనుగోలు చేసే వారు రూ.100 చొప్పున చెల్లించాలి. గొర్రెలు, మేకల విక్రయదారులు, కొనుగోలుదారులకు కూడా ఇదే రుసుము వర్తిస్తుంది. పెద్ద దుకాణాలకు రూ.100, చిన్న దుకాణాలకు రూ.100 రుసుముగా నిర్ణయించారు. పశువుల ప్రవేశ రుసుము రూ.1గా పేర్కొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే లైసెన్స్ రద్దు

వేలంలో హక్కులు పొందిన వ్యక్తి దేవస్థానం నిర్దేశించిన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి. నిర్ణయించిన రుసుముల కంటే అధికంగా వసూలు చేయడానికి అనుమతి లేదు. అధిక వసూళ్లకు పాల్పడినా, ఇతర నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలినా లైసెన్స్‌ను రద్దు చేసే అధికారం దేవస్థానానికి ఉంటుందని అధికారులు స్పష్టం చేశారు.

వేలం పాటదారుడు తన సొంత ఖర్చులతో రూ.100 నాన్ జ్యుడీషియల్ స్టాంప్ పేపర్‌పై దేవస్థానం పేరిట ఒప్పందం చేసుకోవాలి. సంత నిర్వహణ సమయంలో తలెత్తే వ్యక్తిగత వివాదాలు, నష్టాలకు దేవస్థానం బాధ్యత వహించదని నిబంధనల్లో పేర్కొన్నారు.పూర్తి వివరాల కోసం 9989257240 నంబర్‌ను సంప్రదించాలని దేవస్థానం అధికారులు సూచించారు.

ఆదర్శ మున్సిపాలిటీగా అభివృద్ధి చేస్తాం



⏭ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

టీ మీడియా, అక్టోబర్ 25, ఏదులాపురం(ఖమ్మం రూరల్) :

మున్సిపాలిటీని ఆదర్శ మున్సిపాలిటీగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఆదివారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, మున్సిపల్ చైర్‌పర్సన్ పోకబత్తిని అనితతో కలిసి పర్యటించిన మంత్రి, రూ.38 కోట్లతో మద్దులపల్లి నుంచి గొల్లగూడెం రోడ్డు వరకు చేపట్టనున్న నాలుగు లైన్ల రహదారి, సెంట్రల్ లైటింగ్, డివైడర్, సీసీ డ్రైన్ల నిర్మాణ పనులతో పాటు రూ.కోటి వ్యయంతో చేపట్టిన జంక్షన్ల అభివృద్ధి పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూలి రూ.38 కోట్లతో చేపట్టనున్న నాలుగు లైన్ల రహదారి నిర్మాణం పూర్తయితే ఏదులాపురం ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. మద్దులపల్లి నుంచి గొల్లగూడెం వరకు నిర్మించనున్న ఈ రహదారితో పాటు సెంట్రల్ లైటింగ్, డివైడర్, సీసీ డ్రైన్ల నిర్మాణం చేపడుతున్నా మని, పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని పేర్కొన్నారు.ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో ఇప్పటికే ప్రభుత్వం రూ.75.50 కోట్ల నిధులను మంజూరు చేసిందని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఏదులాపురాన్ని ఆదర్శ మున్సిపాలిటీగా అభివృద్ధి చేస్తున్నామని, ఇప్పటికే సుమారు రూ.100 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు కేటాయింపులు జరిగాయని వివరించారు. రహదారులు, డ్రైనేజీలు, జంక్షన్ల అభివృద్ధి తదితర మౌళిక సదుపాయాలను మెరుగుపరిచి పట్టణ ప్రజలకు మెరుగైన వసతులు కల్పిస్తామని స్పష్టం చేశారు.

సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యత

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం సమాంతరంగా అమలు చేస్తోందని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ఆర్డీఓ ఎన్. శ్రీనివాస్, ఏదులాపురం మున్సిపల్ వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ హరినాథ్ బాబు, మున్సిపల్ కమిషనర్ ఏ. శ్రీనివాస రెడ్డి, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మద్యం ఆటో బోల్తా





● బోల్తా పడగానే మరో ఆటోలోకి మద్యం మార్పిడి?

టీ మీడియా, అక్టోబర్ 25, సింగరేణి (కారేపల్లి):

ఖమ్మం జిల్లా సింగరేణి మండలంలో ఆటోల ద్వారా గ్రామాలకు మద్యం తరలిస్తున్నారనే ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. మాణిక్యారం–– ఎర్రబోడు మార్గంలో మద్యం సరుకుతో వెళ్తున్నట్లు చెబుతున్న ఓ ఆటో బోల్తా పడిన ఘటన ఈ అనుమానాలకు మరింత బలం చేకూర్చింది. ప్రమాదం జరిగిన కొద్దిసేపటికే మరో ఆటో అక్కడికి చేరుకుని, బోల్తా పడిన ఆటోలోని మద్యం సరుకును హడావుడిగా మరో ఆటోలోకి మార్చి తరలించినట్లు స్థానికులు చెబుతున్నారు.

స్థానికుల కథనం ప్రకారం.. తెలుపు రంగు ఛార్జింగ్ ఆటోలో మద్యం సరుకు తరలిస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. అయితే, ఆటో బోల్తా పడిన వెంటనే మరో ఆటో వచ్చి మద్యం సరుకును మార్చడం వెనుక అసలు కారణమేంటన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

ఎక్కడి నుంచి వచ్చింది? ఎక్కడికి వెళ్తోంది?

బోల్తా పడిన ఆటోలోని మద్యం ఏ దుకాణం నుంచి తీసుకొచ్చారు? ఎక్కడికి తరలిస్తున్నారు? గ్రామాల్లోని బెల్ట్‌షాపులకు సరఫరా చేస్తున్నారా? మద్యం సరుకును మరో ఆటోలోకి మార్చి తరలించాల్సిన అవసరం ఎందుకొచ్చింది? అనే ప్రశ్నలు స్థానికంగా తలెత్తుతున్నాయి. అయితే, ఈ ఆరోపణలకు సంబంధించి అధికారిక నిర్ధారణ రావాల్సి ఉంది.

ఎక్సైజ్ శాఖ పర్యవేక్షణ ఏది?

మండలంలో ఆటోల ద్వారా మద్యం తరలిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్న నేపథ్యంలో ఎక్సైజ్ శాఖ పర్యవేక్షణపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారంపై అధికారులకు ముందుగానే సమాచారం ఉందా? అక్రమ మద్యం రవాణా జరుగుతోందా? పర్యవేక్షణ లోపాలను ఎవరైనా ఆసరాగా చేసుకుంటున్నారా? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది.బోల్తా పడిన ఆటోలోని మద్యం ఎవరిది? ఏ దుకాణం నుంచి ఎంత సరుకు తరలించారు? దాని గమ్యస్థానం ఎక్కడ? మరో ఆటోలోకి మద్యం మార్చిన ఘటనకు సంబంధించిన వాస్తవాలేమిటి? అన్న అంశాలపై ఎక్సైజ్ అధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

వ్యవహారంపై విచారణ జరిగేనా?

ఆటో బోల్తా పడకపోయి ఉంటే ఈ మద్యం తరలింపు వ్యవహారం వెలుగులోకి వచ్చేదా? ఘటనపై అధికారులు స్పందించి వాస్తవాలను నిగ్గుతేలుస్తారా? మద్యం సరఫరా మార్గాలపై తనిఖీలు చేపడతారా? అన్నది వేచి చూడాల్సి ఉంది.

గోదావరి జలాలను సమర్థంగా వినియోగించుకోవాలి

● అధికారులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాలు

టీ మీడియా ,అక్టోబర్ 25 , అశ్వాపురం :

రానున్న వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, గోదావరి జలాలను సమర్థంగా వినియోగించుకోవాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. ఆదివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలంలోని అమ్మగారిపల్లి పరిధిలో ఉన్న దుమ్ముగూడెం ఆనకట్టను భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠతో కలిసి ఆయన పరిశీలించారు.పడవలో ప్రయాణిస్తూ ఆనకట్ట వద్ద ఇసుక బస్తాల ఏర్పాటు పనులను మంత్రి పర్యవేక్షించారు. ఆనకట్టపై మీటరు ఎత్తున సుమారు లక్షన్నర ఇసుక బస్తాలను ఏర్పాటు చేసి, ఒక టీఎంసీ నీటిని నిల్వ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. రోజుకు 10 వేల నుంచి 15 వేల ఇసుక బస్తాలను ఏర్పాటు చేసేలా పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు.ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో ప్రజలు నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని మంత్రి కోరారు. రైతులు నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. వేసవిలో నీటి అవసరాలను తీర్చేందుకు తుమ్మలచెరువు, సింగభూపాలం, అన్నదైవం, మూకమామిడి చెరువులను



నింపాలని ఆదేశించారు. అదేవిధంగా వైరా, లంకసాగర్ ప్రాజెక్టుల్లో నీటి నిల్వలను పెంచేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.ఉపాధి హామీ పథకం ద్వారా కాలువల మరమ్మతులు చేపట్టడంతో పాటు చెరువుల్లో పూడికతీత పనులు నిర్వహించాలని మంత్రి స్పష్టం చేశారు. వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఎస్ఈ, సర్పంచ్ కవిత, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రాజుపేట కాలనీలో కార్డన్ అండ్ సెర్చ్



● 1-50 కేసులు నమోదు..

రూ.36,390 జరిమానా

టీ మీడియా, అక్టోబర్ 25, భద్రాచలం:

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు భద్రాచలం డీఎస్పీ అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం తెల్లవారుజామున రాజుపేట కాలనీలో పోలీసులు కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. నేరాల నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాల కట్టడి, ప్రజల భద్రతను బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ తనిఖీలు చేపట్టారు.ఈ తనిఖీల్లో సరైన ధ్రువపత్రాలు లేని 42 ద్విచక్ర వాహనాలు, 8 ఆటోలు, నంబర్ ప్లేట్లు లేని మరో 8 వాహనాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలకు సంబంధించి మొత్తం 150 కేసులు నమోదు చేసి రూ.36,390 జరిమానా విధించారు.

మత్తు పదార్థాలపై కఠిన చర్యలు

కమ్యూనిటీ కనెక్ట్ కార్యక్రమంలో భాగంగా కాలనీవాసులతో మాట్లాడిన డీఎస్పీ అరుణ్ కుమార్.. గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగం, విక్రయం, అక్రమ రవాణాకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. గంజాయికి బానిసైన వారిని గుర్తించి డీ-అడిక్షన్ కేంద్రాలకు తరలించే విషయంలో ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. నేరాల నియంత్రణ, ప్రజల భద్రత కోసం కాలనీల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని డీఎస్పీ హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

సైబర్ నేరగాళ్ల మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఓటీపీలు, బ్యాంకు ఖాతా వివరాలు, యూపీఐ పిన్‌లను ఇతరులతో పంచుకోవద్దని తెలిపారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు.కాలనీల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారి సమాచారాన్ని పోలీసులకు అందించాలని, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకు సహకరించాలని కాలనీవాసులకు విజ్ఞప్తి చేశారు. ప్రజల భద్రత, నేరాల నియంత్రణ కోసం ఇటువంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో సీఐ రాజు, వెంకటప్పయ్య, పోలీసు అధికారులు, సిబ్బంది, స్పెషల్ పార్టీ సిబ్బంది, డాగ్ స్క్వాడ్ బృందం తదితరులు పాల్గొన్నారు.

యాప్‌తో రైతులకు ఏఐ సాయం!



● ఒకే వేదికపై వ్యవసాయ సేవలు

టీ మీడియా ,అక్టోబర్ 25,అమరావతి బ్యూరో:

ప్రకృతి వైపరీత్యాలు, వాతావరణ మార్పులు, చీడపీడల బెడదతో ప్రతి ఏటా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. సాగు ఖర్చులు పెరగడం, పంట దిగుబడులు తగ్గడం, గిట్టుబాటు ధరలు లభించకపోవడం అన్నదాతలకు సవాలుగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో వ్యవసాయాన్ని మరింత సులభతరం చేసి, రైతులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని చేరువ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత భారత్ విస్తార్ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. దీని ద్వారా విత్తనశుద్ధి, సాగు పద్ధతులు, చీడపీడల నివారణ, సమగ్ర సస్యరక్షణ, పంటల యాజమాన్య పద్ధతులు, మార్కెటింగ్, మద్దతు ధరలకు సంబంధించిన సమాచారాన్ని పొందే అవకాశం ఉంది.

సాగు మెలకువలు.. క్షణాల్లో సమాచారం!

రబీ సీజన్ నేపథ్యంలో రైతులు ఏఐ ఆధారిత వ్యవసాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ రంగ నిపుణులు సూచిస్తున్నారు. పొలంలో పంటకు చీడపీడలు లేదా తెగుళ్లు సోకినట్లు గుర్తిస్తే, సంబంధిత లక్షణాలను యాప్ ద్వారా తెలియజేసి వాటి నివారణకు అవసరమైన సమాచారాన్ని పొందవచ్చు. సమస్యను గుర్తించడం, తగిన నివారణ చర్యలు తెలుసుకోవడం ద్వారా పంట నష్టాలను తగ్గించుకునేందుకు ఈ సాంకేతికత దోహదపడుతుంది.అలాగే సాగు చేయాలనుకుంటున్న పంటకు అనువైన విత్తనాలు, సాగు విధానాలు, ఎరువుల వినియోగం, పంటల యాజమాన్య పద్ధతులపై సమాచారాన్ని తెలుసుకోవచ్చు. పంట చేతికొచ్చిన తర్వాత మార్కెట్ పరిస్థితులు, ధరల వివరాలను పరిశీలించి మెరుగైన విక్రయ నిర్ణయాలు తీసుకునేందుకు కూడా డిజిటల్ సేవలు ఉపయోగపడతాయి.


వాతావరణ హెచ్చరికలతో పంటలకు రక్షణ

ఏ ప్రాంతంలో ఏ కాలంలో ఏ పంట సాగు చేయాలనే నిర్ణయంలో వాతావరణ పరిస్థితులు కీలక పాత్ర పోషిస్తాయి. భారీ వర్షాలు, వరదలు, ఈదురుగాలులు, వడగండ్ల వాన వంటి ప్రకృతి వైపరీత్యాల సమయంలో పంటలను కాపాడుకునేందుకు అవసరమైన సూచనలు రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి. వాతావరణం, పంట పరిస్థితులకు సంబంధించిన సమాచారాన్ని సకాలంలో తెలుసుకోవడం ద్వారా సాగు ప్రణాళికలను మెరుగుపరచుకోవచ్చు.

ప్రాంతీయ భాషల్లో సేవలు

వ్యవసాయ సమాచారాన్ని రైతులకు సులభంగా అర్థమయ్యేలా అందించడం డిజిటల్ సేవల ప్రధాన లక్ష్యం. ప్రాంతీయ భాషల్లో అందుబాటులో ఉండే వ్యవసాయ సమాచార సేవలు రైతులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని చేరువ చేస్తాయి. స్మార్ట్‌ఫోన్ వినియోగించే రైతులు భారత్ విస్తార్ యాప్ అధికారిక లభ్యత, వినియోగ విధానం, అందుబాటులో ఉన్న సేవలను పరిశీలించి ఉపయోగించుకోవాలి.ఏఐ సాంకేతికతను సద్వినియోగం చేసుకుంటే సాగులో సరైన నిర్ణయాలు తీసుకోవడానికి, అనవసర ఖర్చులను తగ్గించడానికి, పంటల దిగుబడులను మెరుగుపరచడానికి తోడ్పడుతుంది. అయితే పంటకు మందులు వాడే ముందు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు తీసుకోవడం, మందుల లేబుల్‌పై పేర్కొన్న మోతాదులు, భద్రతా నియమాలు పాటించడం తప్పనిసరి.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు



● ఓటు -నమోదుకు

ముందుకు రాని యువత!

టీమీడియా , అక్టోబర్ 25 , హైదరాబాద్ బ్యూరో :

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ నియోజకవర్గాల్లో ఓటు నమోదు (ఫారం–18) కోసం గ్రాడ్యుయేట్లు పెద్దగా ఆసక్తి చూపడం లేదనే విషయం స్పష్టంగా అర్థమవుతోంది. ఈ ఓటరు నమోదు ప్రక్రియ ప్రారంభించి దాదాపు నెల రోజులు కావొస్తున్నా శనివారం వరకు రెండు స్థానాలకు కలిపి 5,23,758 అప్లికేషన్లు మాత్రమే వచ్చాయి. కొత్త ఓటర్ల నమోదుకు ఎన్నికల సంఘం సెప్టెంబర్ 28న నోటిఫికేషన్ జారీ చేసింది. ఇప్పటివరకు మహబూబ్‌నగర్–రంగారెడ్డి–హైదరాబాద్ పరిధిలో 2,29,937, వరంగల్–ఖమ్మం–నల్గొండ పరిధిలో 2,93,821 మంది మాత్రమే దరఖాస్తు చేశారు.

ప్రత్యేక క్యాంపులపై దృష్టి

ఓటరు నమోదు ప్రక్రియలో భాగంగా ఫారం–18 సమర్పించడానికి నవంబర్ 6 వరకే ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. 2021లో జరిగిన ఎన్నికల్లో మహబూబ్‌నగర్–రంగారెడ్డి–హైదరాబాద్ పరిధిలో 5,31,268 మంది, వరంగల్–ఖమ్మం–నల్గొండ పరిధిలో 5,05,565 మంది కలిపి మొత్తంగా రెండు నియోజకవర్గాల్లో 10 లక్షలకు పైగా ఓటర్లు ఉన్నారు. ఈసారి ఆశించిన స్థాయిలో ఓటర్లు నమోదు కాకపోవడంతో ప్రధాన రాజకీయ పార్టీలు ప్రత్యేకంగా క్యాంపులు పెట్టే అంశంపై దృష్టి సారించాయి.

తక్కువగా ఓటర్లు నమోదు అయితే గెలుపోటములపై తీవ్రమైన ప్రభావం పడే అవకాశం ఉండడంతో గడువులోగా సాధ్యమైనంత ఎక్కువ మందిని ఓటర్లుగా నమోదు చేయించాలని పార్టీల ప్రజా ప్రతినిధులు, కో–ఆర్డినేటర్లు భావిస్తున్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘాల ఆధ్వర్యంలో కూడా ప్రత్యేక మీటింగ్?లను ఏర్పాటు చేసి గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదుపై దృష్టి కేంద్రీకరించాయి.

వచ్చినవీ బీఎల్‌వో స్థాయిలోనే

మరోవైపు రెండు ఎమ్మెల్సీ నియోజకవర్గాల్లో ఫారం–18 ద్వారా వచ్చిన కొత్త దరఖాస్తుల విచారణ ఇంకా బీఎల్‌వో స్థాయిలోనే ఉండటం వారి నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. ప్రస్తుతం వారు ఎస్?ఐఆర్? నోటీసులు, విచారణ దశలో ఉండడం కూడా ఒక కారణంగానే చూడవచ్చు. దీనివల్ల పూర్తి స్థాయిలో పట్టభద్రుల స్థానాల ఓటరు కార్యక్రమం (ఫారం–18)పై దృష్టి సారించడం వారికి కొంత ఇబ్బందిగా మారింది. ప్రస్తుతం తెలంగాణ వ్యాప్తంగా 90 శాతానికి పైగా ఫారం–18 పత్రాలు ఆన్‌లైన్ ద్వారానే వచ్చినట్లు ఎన్నికల సంఘం తెలిపింది.

మూడు దశల్లో ఓటరు వివరాల విచారణ

కొత్త ఓటరు దరఖాస్తులను బీఎల్‌వో, ఏఈఆర్వో, ఈఆర్వో స్థాయిలో విచారణ చేసి తుది ఓటరు జాబితాలో చేర్చాల్సిన ప్రక్రియ ఉంటుంది. మహబూబ్‌నగర్–రంగారెడ్డి–హైదరాబాద్ పరిధిలో 1.91 లక్షల పత్రాల విచారణ ఇంకా బీఎల్‌వో స్థాయిలో ఉంది. ఈ నియోజకవర్గంలో మొత్తం 2.29 లక్షల దరఖాస్తులు రాగా, ఇందులో 4,695 మందివి మాత్రమే ఇప్పటి వరకు తుది ఓటర్ల జాబితాలో చేర్చడం కోసం వివిధ డివిజన్ల ఈఆర్వో(ఆర్డీవో)లు ఆమోదించారు. వరంగల్–ఖమ్మం–నల్గొండ పరిధిలో 2.93 లక్షల ఓటు నమోదుకు దరఖాస్తులు రాగా, 1.96 లక్షల పత్రాలు బీఎల్‌వో స్థాయిలో విచారణ దశలోనే ఉండటం గమనార్హం. ఇప్పటివరకు ఈ నియోజకవర్గంలో 21,390 మందిని మాత్రమే తుది జాబితాకు పంపించారు. మిగతావి విచారణ దశలో, మరికొన్ని పెండింగ్‌లో ఉన్నాయని అధికారులు చెబుతున్నారు.